క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నందున నల్లగొండ పట్టణంలో మంగళవారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ డి.శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బస్టాండ్, డాక్టర్స్ కాలనీ, అన్సారి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

గడువు పొడిగింపు

మర్రిగూడ: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల గడువును ఈ నెల 11 వరకు పొడిగించినట్లు మర్రిగూడ హైస్కూల్ హెచ్‌ఎం నీరుడు అంజయ్య సోమవారం తెలిపారు. మధ్యలో చదువు మానేసినవారు ఓపెన్ స్కూల్ ద్వారా తమ విద్యను కొనసాగించవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ డి.సుందరయ్య 9440927542 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మండల అధ్యక్షురాలిగా ఈశ్వరమ్మ

కట్టంగూర్ : కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలిగా కట్టంగూర్‌కు చెందిన మేడి ఈశ్వరమ్మ నియమితులయ్యారు. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి సోమవారం ఈశ్వరమ్మకు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు బొడ్డుపల్లి జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు

చండూరు : చండూరు రైతు సేవా సహకార సంఘంలో ఓటు హక్కు దరఖాస్తు చేసుకునేందుకు రైతులు సోమవారం బారులుదీరారు. ఈ నెల 12 వరకు రైతులు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు అధికారులు ప్రకటించడంతో రైతులు ఓటు నమోదు చేసుకునేందుకు భారీగా వస్తున్నారు. ఎకరం ఆపైన ఉన్న రైతులు మాత్రమే ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని చైర్‌పర్సన్ కోడి సుష్మ తెలిపారు.

10 నుంచి క్రికెట్ టోర్నమెంట్

శాలిగౌరారం: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని బైరవునిబండ గ్రామంలో ఉమామహేశ్వర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 17 వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ ప్రతినిధులు సోమవారం తెలిపారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.30 వేలు, షీల్డ్, రెండో బహుమతి రూ. 20 వేలు, షీల్డ్, మూడో బహుమతి రూ.10 వేలు, షీల్డ్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశ రుసుం రూ.600 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

విచారణ చేపట్టాలని వినతి


ఎమ్మెల్యే మందుల సామేల్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

శాలిగౌరారం: శాలిగౌరారం ప్రాజెక్టు అభివృద్ధి నిధుల దుర్వినియోగంపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయకట్టు రైతులు సోమవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు తిరుమలగిరిలోని క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ శాలిగౌరారం ప్రాజెక్టు అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వంలో గతంలో రూ.6 కోట్లు మంజూరు చేసిందన్నారు. 2020–21 సంవత్సరంలో పనులు ప్రారంభించి పనులు చేపట్టి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. వినతిపత్రాన్ని అందజేసినవారిలో చాడ సురేశ్ రెడ్డి, గోదల నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పడాల సైదులు, వెంకన్న, మహేశ్ ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ టీఎస్ ఇన్‌చార్జ్‌గా ఏడుకొండలు

మాడుగులపల్లి : ఎమ్మార్పీఎస్ టీఎస్ నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మండల కేంద్రానికి చెందిన పుల్లెంల ఏడుకొండలు నియమితులయ్యారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు కత్తుల తులసీదాస్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి నరసింహ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదయ్య, ప్రచార కార్యదర్శి నాగయ్య, జిల్లా అధికార ప్రతినిధి ఎరోళ్ల శ్రీను, చెరుకుపల్లి రాజు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలి

చిట్యాల: విద్యార్థుల్లో సామర్థ్యాలు, నైపుణ్యాలను పెంపొందించేందుకు ఎఫ్ఎల్ఎన్(ఫౌండేషన్ ఫర్ లిటరసీ అండ్ న్యూమరిక్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఏఎంఓ (అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్) రామచందర్‌నాయక్ తెలిపారు. చిట్యాల మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు సోమవారం చిట్యాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంప్లెక్స్ సమావేశాల్లో పాల్గొన్న ఉపాధ్యాయులంతా బోధనానుభవాలను పెంచుకోవాలని సూచించారు. ఎంఈఓ కె.నర్సింహ, మండల నోడల్ అధికారి కె.అంజిరెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కె.కరుణాకర్ రెడ్డి, జయకాంత్, పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ఆరోగ్య ఉప కేంద్రాలు

- అరకొర వసతుల మధ్య వైద్య సేవలు
- మూడున్నరేళ్లుగా అందని భవనాల అద్దె

నకిరేకల్ : గ్రామీణ ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆరోగ్య ఉప కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. లక్ష్యం ఉన్నతంగా ఉన్నా అమలులో మాత్రం పరిస్థితి అధ్వానంగా ఉంది. ఆరోగ్య కేంద్రాలు అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. మరోవైపు అద్దె భవనాల్లో కొనసాగే ఆరోగ్య ఉప కేంద్రాలకు ప్రతినెలా చెల్లించాల్సిన అద్దె కూడా ప్రభుత్వం చెల్లించడం లేదు. మూడున్నరేళ్లుగా అద్దె రుసుము పెండింగ్‌లో ఉండడంతో కేంద్రాలను నిర్వహిస్తున్న ఏఎన్ఎంలపైనే భారం పడుతోంది. నకిరేకల్, కట్టంగూర్, కేతేపల్లి, నార్కట్‌పల్లి, చిట్యాల, శాలిగౌరారం మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 55 ఆరోగ్య ఉప కేంద్రాలున్నాయి. వీటిలో 17 కేంద్రాలకు మాత్రమే పక్కా భవనాలుండగా మిగతా 38 ఆరోగ్య ఉప కేంద్రాలు అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వం హయాంలో 15 ఉప కేంద్రాల భవనాల నిర్మాణానికి శంకుస్థాపలు చేశారు.

మూడేళ్లుగా అందని అద్దె బిల్లులు..

ఒక్కో ఆరోగ్య ఉప కేంద్రంలో ఇద్దరు ఏఎన్ఎంలు, ఒక హెల్త్ అసిస్టెంట్లు పని చేస్తున్నారు. వీరితోపాటు వెయ్యి జనాభాకు ఒక్కరు చొప్పున ఆశా వర్కర్‌ను కూడా ప్రభుత్వ నియమించింది. ఆయా ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో పర్యటిస్తూ కుటుంబ నియంత్రణను ప్రోత్సహించడంతోపాటు గర్భిణులకు పరీక్షలు నిర్వహించడం, తల్లీబిడ్డ సంరక్షణ, గ్రామీణులకు ఆరోగ్య సూత్రాలను తెలియజేయాల్సిన బాధ్యత ఆరోగ్య కార్యకర్తలపై, వైద్య సిబ్బందిపై ఉంది. ఉప కేంద్రంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్ర 5గంటల వరకు ఏఎన్ఎంలు అందుబాటులో ఉండి అవసరం వచ్చిన వెంటనే సేవలందిస్తున్నారు. ఒక్కో ఆరోగ్య ఉప కేంద్రానికి నెలకు అద్దె రూ.1250 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. ఒక్కో ప్రాంతంలో అద్దె రుసుము ఎక్కువగా ఉండడంతో అదనపు భారం వైద్య సిబ్బందిపై పడుతుంది. అద్దె భవనాల్లో ఉన్న ఆరోగ్య కేంద్రాలకు మూడున్నరేళ్ల నుంచి చెల్లించాల్సిన అద్దె నేటికీ అందలేదు.


గోరెంకలపల్లిలో అద్దె ఇంట్లో ఆరోగ్య ఉప కేంద్రం

నకిరేకల్ డివిజన్ ఆరోగ్య ఉప కేంద్రాల వివరాలు

మండలం	మొత్తం భవనాలు	పక్కా భవనాలు	అద్దె భవనాలు
నకిరేకల్	11	1	10
కేతేపల్లి	07	3	4
కట్టంగూర్	08	3	5
నార్కట్‌పల్లి	09	2	7
చిట్యాల	11	2	9
శాలిగౌరారం	09	6	3
మొత్తం	55	17	38


కొప్పోలు గ్రామంలో అద్దె భవనంలో ఆరోగ్య సేవలు అందిస్తున్న సిబ్బంది

ఎన్నికలకు ఆరు నెలల ముందు శంకుస్థాన

అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌కు ఆరు నెలల ముందు నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణ వెల్లంల, ఏపీ లింగోటం, అమ్మనబోలు, చిట్యాల మండలంలోని చిన్నకాపర్తి, వట్టిమర్తి, తాళ్ల వెల్లంల, నకిరేకల్ మండలంలోని కడపర్తి, నోముల, గోరెంకలపల్లి, మంగళపల్లి, కట్టంగూరు మండలంలోని పామనగుండ్ల, కురుమర్తి గ్రామాల్లో భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వాటిలో మాధవ ఎడవల్లి, నార్కట్‌పల్లి, తొండల్‌వాయి గ్రామాల్లో భవన నిర్మాణ పనులు సాగుతున్నాయి. శాలిగౌరారం మండలం వల్లాలలో వారం రోజుల క్రితమే శంకుస్థాపన చేశారు. కేతేపల్లి మండలం బీమారం, కొప్పోలు, గుడివాడ గ్రామాలకు పక్కా భవనాలు మంజురయ్యాయి. ఇంకా శంకుస్థానలు చేయలేదు.

సిబ్బంది అందుబాటులో ఉండాలి



గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన ఆరోగ్య ఉప కేంద్రాలకు పక్కా భవనాలు లేకపోవడం వల్ల వైద్య సేవలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందడం లేదు. పక్కా భవనాలు నిర్మించి సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. తద్వారా పేదలకు సత్వర వైద్యం అందుతుంది.

– వంగాల గోవిందరెడ్డి, భూపతికుంట, నకిరేకల్ మండలం

నెలానెలా అద్దెలు చెల్లించాలి



ఆరోగ్య ఉప కేంద్రాలకు ప్రతినెలా రావాల్సిన అద్దె రుసుములు మూ డున్నరేళ్లుగా అందడం లేదు. ఒక్కో ప్రాంతంలో అద్దె రుసుము కూడా ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం నెలకు ఇచ్చే రూ.1250 అద్దె ఎటూ చాలడం లేదు. అద్దె కూడా నెలనెలా చెల్లించాలి.

– వరికుప్పల శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్

స్థలాల కోసం ప్రతిపాదనలు పంపాం



గత ఏడాది 17 ఆరోగ్య ఉప కేంద్రాల భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వీటిలో మూడు గ్రామాల్లో భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మిగతా గ్రామాల్లో స్థలాల కోసం ఆయా గ్రామ పంచాయతీల నుంచి తీర్మానం చేసి ప్రతిపాదనలు పంపాం.

– రాపోలు రవి, ఆరోగ్య కేంద్రాల సబ్ యూనిట్ అధికారి, నకిరేకల్

క్యాలెండర్ల ఆవిష్కరణ

రామగిరి(నల్లగొండ): తెలంగాణ గెజిటెడ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్(టీజీసీటీఏ) నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఎన్జీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉపేందర్ ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సుముద్రాల ఉపేందర్, అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందిన డాక్టర్ లక్ష్మణ్‌గౌడ్, డాక్టర్ ఎన్.దీపికలను అధ్యాపకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఎంజీయూ సెక్రటరీ డాక్టర్ ఏ.దుర్గాప్రసాద్, డాక్టర్ వైవి.ప్రసన్నకుమార్, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాగిరెడ్డి, నారాయణరావు, ముత్తయ్య, యాదగిరిరావు, మల్లేష్, రవి, భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

కనగల్: పీఆర్టీయూ కనగల్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎంపీపీ కరీంపాషా, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వంగాల సహదేవరెడ్డి, ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, ఎంఈఓ తరి రాములు, ఎంఎస్‌వో వెంకట్‌రామ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం నారాయణరెడ్డి, మండల అధ్యక్షకార్యదర్శులు తిరందా సత్తయ్య ఏంరెడ్డి సైదిరెడ్డి పాల్గొన్నారు.

చిట్యాల: మండల ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విడుదల చేశారు. ముదిరాజ్ మహాసభ చిట్యాల మండల అధ్యక్షుడు బుంగపట్ల తిమ్మయ్య, ప్రధానకార్యదర్శి గుడిసె యాదయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పరబోయిన స్వామి, నక్క రాంబానేష్, పందిరి శ్రీనివాస్, సాదుల నరసయ్య, వెలుగు రవి, కనుకు వెంకటనారాయణ, నూతి వెంకటేశ్వర్లు, గుండోబోయిన దశరథ పాల్గొన్నారు.

నల్లగొండ టూటౌన్: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను సోమవారం సంఘం నాయకులు జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నూకల జగదీష్‌చంద్ర, పందిరి శ్యాంసుందర్, ఎండీ. అబ్దుల్ ఖాదర్, వనం శ్రీవాణి, రమేష్, గుండాల భిక్షమయ్య, ఎల్. మాధవరెడ్డి పాల్గొన్నారు.

మంత్రుల ఫ్లెక్సీలకు పాలాభిషేకం

నల్లగొండ: రజకులకు 250 యూనిట్ల విద్యుత్ పథకాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాసంలో మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం ప్రభాకర్ ఫ్లెక్సీలకు రజక సంఘం నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ ఓబీసీ సెల్ అధ్యక్షుడు జంజిరాల గిరి పాల్గొని మాట్లాడుతూ అర్హులైన రజకులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, బీసీ బంధు ఇవ్వాలని కోరారు. నాంపల్లి కిరణ్, చిక్కుల అంజయ్య, పగిళ్ల రాజు, నాగిల్ల యాదయ్య, చిక్కుళ్ళ శ్రీను, దామనూరి శ్రీను, నాంపల్లి యాదయ్య, ఎలిజాల శంకర్, నాంపల్లి గోపి, ఎలిజాల వెంకన్న, ఇటికాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గత పాలనలో ఆర్భాటాలే తప్ప.. అభివృద్ధి లేదు

నల్లగొండ టూటౌన్: గత ప్రభుత్వ హయాంలో హంగు, ఆర్భాటాలే తప్ప అభివృద్ధి జరగలేదని మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. నల్లగొండ పట్టణంలో సీసీ రోడ్లు, యూజీడీ, తాగు నీటి సరఫరా పనులు గతంలో మంత్రి కోమటిరెడ్డి హయాంలో జరిగినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో కేవలం ఒక్క ప్రధాన రోడ్డు మాత్రమే వేశారని, అది కూడా ప్రమాదాలకు కారణమవుతూ పలువురు మృత్యువాత పడ్డారని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో అవినీతి, అక్రమాలు జరిగాయని, ఒంటెద్దు పోకడలతోనే బీఆర్ఎస్ కౌన్సిలర్లందరు కాంగ్రెస్ పక్షాన నిలిచినట్లు తెలిపారు. నల్లగొండ పట్టణ అభివృద్ధి కోమటిరెడ్డి సారథ్యంలోనే సాధ్యమని, మంత్రి ప్రభుత్వం నుంచి అధిక నిధులు తెచ్చి పట్టణాన్ని అభివృద్ధి చేస్తారని అన్నారు. వారి వెంట కౌన్సిలర్లు ఖయ్యుంబేగ్, బోయినపల్లి శ్రీనివాస్, సమి, ప్రదీప్‌నాయక్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అబ్బగోని రమేష్

అయోధ్య శ్రీరాముడి అక్షింతల పంపిణీ


మునుగోడు : అక్షింతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

నార్కట్‌పల్లి: మండలంలోని మాండ్ర గ్రామంలో గల ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం అయోధ్య శ్రీరాముడి అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఉత్తరపల్లి నరసింహాచార్యులు ఆలయంలో కలశపూజ, దీక్ష కంకణం పూజలను నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు రామభక్త హనుమాన్, బృందం, కర సేవకులు అక్షింతలను పంపిణీ చేశారు. మల్లెబోయిన నర్సింహ, రమేష్, ప్రజ్ఞాపురం లింగస్వామి, తరాల శ్రీను, రామలింగం, చిన్నశ్రీనివాస్, లింగస్వామి, యాదగిరి, కృష్ణారెడ్డి, ధనంజయ్య పాల్గొన్నారు.

మునుగోడు : అయోధ్య రామయ్య అక్షింతలను మునుగోడు మండల కేంద్రంలో శోభాయాత్ర నిర్వహించి ఇంటింటికీ పంపిణీ చేశారు.మిరియాల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ బొడ్డు శ్రావణినాగరాజుగౌడ్, ఆలయ చైర్మన్ పాల్వాయి చెన్నారెడ్డి, ఆర్ఎస్ఎస్ సహ సంచాలక్, ఇటుకల కృష్ణయ్య, వేణుకుమార్, ప్రమోద్‌కుమార్, బొడ్డు యాదయ్య, కళ్యాణ్, రవివర్మ, సాయిచంద్, ప్రభాకర్, ఆలయ ప్రధాన అర్చకులు కొండోజు నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండల కేంద్రంలో ఇంటింటికి అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. పూజారి శేషభట్టర్ జగన్మోహనాచార్యులు, రమేశ్, ఉపేందర్, నాగయ్య, భిక్షం, సాయి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కనగల్: జి యడవల్లి ఉన్నత పాఠశాల చెందిన 1988–89 విద్యా సంవత్సరం ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు యడవల్లిలో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు బలరాం, రవీంద్రనాథ్, శేఖర్, యాదగిరి నేలంటి రవి, ఎన్న సత్తిరెడ్డి, అయితగోని స్వామిగౌడ్, కందుల పర్వతాలు, లక్ష్మయ్య, కొర్వి యాదగిరి, గౌని సాయిలు, అయితగోని స్వామిగౌడ్, మాదగాని నరేందర్, రాజేశ్వరి, లక్ష్మమ్మ, జయప్రద పాల్గొన్నారు.


నూతన కలెక్టర్ హరిచందనకు బొకే అందజేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్


నూతన కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న డీఈఓ భిక్షపతి


కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు


బొకే అందజేస్తున్న రేఖల భద్రాద్రి, పసల శౌరయ్య

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


బీపీ చెక్ చేయించుకుంటున్న నకిరేక ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి: గ్రామీణ ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. సోమవారం నార్కట్‌పల్లి మండల పరిధిలోని చిన్నతుమ్మలగూడెంలో గ్రామానికి చెందిన బండా సాగర్‌రెడ్డి సహకారంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ యశోద ఆస్పత్రి వారు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే వీరేశం ప్రారంభించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందించే పది లక్షల ఆరోగ్య శ్రీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం చిన్నతుమ్మలగూడెం గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే వీరేశం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ యాదగిరి, సర్పంచ్‌లు దాసరి రాజు, కొండయ్య, ఎంపీటీసీ ఉంద్ర భాగ్యమ్మ లింగారెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు తీగల మోహన్‌రెడ్డి, రవీందర్ రావు, కేవీ ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, పూర్ణచందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, మాజీ జెడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య, సిద్దగోని స్వామి, సట్టు సత్తయ్య, అచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధు యూనిట్లను గ్రౌండింగ్ చేయాలి


దీక్షలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల

నల్లగొండ టౌన్: నల్లగొండ నియోజకవర్గంలో 1056 మందికి మంజూరైన దళిత బంధు పథకం యూనిట్లను వెంటనే గ్రౌండింగ్ చేయాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం దళిత బంధు పథకానికి ఎంపికైన లబ్ధిదారులతో కలిసి స్థానిక కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం లబ్ధిదారులందరికీ రూ.3 లక్షల చొప్పున నిధులను కూడా విడుదల చేసిందన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో యూనిట్లు గ్రౌండింగ్ చేయడం నిలిచిపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కుంటిసాకులు చూపుతూ పథకాలను అమలు చేయకుండా కాలయాపన చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దళిత బంధు పథకం గ్రౌండింగ్ అయ్యేంత వరకు లబ్ధిదారులకు అండగా ఉంటామని, అమలు చేయకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. దళిత బంధు సాధన సమితి కన్వీనర్ పాలడుగు నాగార్జున మాట్లాడుతూ దళితులకు అన్యాయం చేస్తే సమితి చూస్తూ ఊరుకోదని, పథకాన్ని గ్రౌండింగ్ చేసే వరకు లబ్ధిదారులకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీనివాస్, రవీందర్, దేవేందర్, లక్ష్మయ్య, వెంకన్న, శంకర్, సైదులు, రమేష్, శ్రీకర్, విమలమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వార్థ ప్రయోజనాల కోసమే అవిశ్వాసం

నల్లగొండ టూటౌన్: అవినీతికి పాల్పడితే అవిశ్వాస తీర్మానం పెట్టాలిగానీ, స్వార్థ ప్రయోజనాల కోసమే అవిశ్వాసం పెట్టారని మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి అన్నారు. అవిశ్వాస తీర్మాన సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొందరు కౌన్సిలర్లు ఏ పార్టీ అధికారంలో ఉంటే అక్కడ ఉంటారని, డబ్బుకు అమ్ముడుపోయిన వారు మళ్లీ ప్రజలకు ఎలా న్యాయం చేస్తారో పట్టణ ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. విప్‌ను ధిక్కరించి కాంగ్రెస్‌కు ఓటేశారని.. కుట్రలు, కుతంత్రాలతో సొంత పార్టీకి అన్యాయం చేసిన కౌన్సిలర్లపై అనర్హత వేటు వేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. తాము రాజకీయ విలువలతో ఆనాడు బొడ్డుపల్లి లక్ష్మిని చైర్మన్ పదవి నుంచి దింపలేదని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి ఇలాంటి రాజకీయాలు చేయడం తగదని అన్నారు. కోమటిరెడ్డి ఎమ్మెల్యేగా, మంత్రిగా 20 ఏళ్ల కాలంలో నల్లగొండను అభివృద్ధి చేయలేదని, కనీసం ఇప్పుడైనా నల్లగొండ అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సహకారంతో వందల కోట్ల రూపాయలతో నల్లగొండను అభివృద్ధి చేసి చూపించామని అన్నారు.


మాట్లాడుతున్న మందడి సైదిరెడ్డి

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

నకిరేకల్ : మండలంలోని చందుపట్ల గ్రామంలో రాణి రుద్రమదేవి కోలాట బృందం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో గ్రామస్తుల సమక్షంలో గజ్జ కోలాటం నిర్వహించారు. ముందుగా రుద్రమదేవి మరణ శిలాశాసనం ఎదుట కోలాట బృందం సభ్యులు పూజలు చేశారు. ఎంపీటీసీ ఇమడపాక లక్ష్మీ వెంకన్న, మాజీ ఎంపీటీసీ గోనె నర్సింహారావు, మాస్టర్ సంధ్యక్క, మంగమ్మ, సంప్రద, నర్సమ్మ, శోభ, మమత, శిరీష పాల్గొన్నారు.

ఐద్వా సభ్యత్వ నమోదు


నకిరేకల్ : ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం నకిరేకల్ పట్టణంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. చెన్నబోయిన నాగమణి, మాజీ ఎంపీపీ సుంకి మణెమ్మ, ప్రతినిధులు పన్నాల శశికళ, మంజుల, రమణ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలో ఐద్వా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ ప్రారంభించారు. సులోచన, అనసూర్య, కావేరి, ఇంద్ర, మణి పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

చండూరు: పాలకమండలి సభ్యుల గైర్హాజరుతో చండూరు మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ యాకూబ్ నాయక్ సోమవారం ప్రకటించారు. ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసిన సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పూర్తిస్థాయిలో హాజరు కాలేదు. సమావేశానికి అధికారులు, నలుగురు సర్పంచులు మాత్రమే హాజరయ్యారు. దీంతో మధ్యాహ్నం రెండు గంటలకు మరోసారి సభను ఏర్పాటుచేశారు. అయినప్పటికీ సభ్యులు రాకపోవడంతో తిరిగి మంగళవారం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లుగా ఎంపీడీఓ తెలిపారు. రెండు మూడు పర్యాయాలుగా ప్రజాప్రతినిధులు సభకు హాజరుకాకపోవడంతో గ్రామాల్లో ప్రజా సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ పల్లె కళ్యాణి, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్సలో విద్యార్థుల ప్రతిభ


గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు

నాంపల్లి: షాద్‌నగర్‌లో ఆదివారం జరిగిన మెమోరిల్ ఆఫ్ ఫ్రీడమ్ ఫైటర్స్ 16వ నేషనల్ లెవల్ ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో నాంపల్లికి చెందిన ఇద్దరు విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించారు. విద్యార్థులు ఈ నెల 28న హైదరాబాద్‌లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే రెండో అంతర్జాతీయ స్థాయి కరాటే, కుంగ్‌ఫూ, తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు నాంపల్లి ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకుడు, మాస్టర్ ఎస్‌కే షంషేర్ తెలిపారు.

పీఏసీఎస్ డైరెక్టర్ల నిరసన


కింద కూర్చొని నిరసన తెలుపుతున్న డైరెక్టర్లు

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి పీఏసీఎస్ కార్యాలయంలో సోమవారం ఆ సంఘానికి చెందిన డైరెక్టర్లు నిరసన తెలిపారు. పాలకవర్గ సర్వసభ్య సమావేశాలకు తమకు సమాచారం ఉండడం లేదని డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి ఎదుట డైరెక్టర్లు దోర్నాల రామచంద్రం, బొడిగె సైదులుగౌడ్ కార్యాలయంలో కింద కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నెలలుగా తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే చైర్మన్, సీఈఓ సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. దీంతో ఈ నెల 22వ తేదీన సమావేశం నిర్వహించి విచారిస్తామని సీఈఓ రాజమల్లు ప్రకటించడంతో డైరెక్టర్లు నిరసన విరమించారు.

విద్యతోపాటు సంస్కారాన్ని అలవర్చుకోవాలి


మాట్లాడుతున్న త్రిదండి దేవానాద జీయర్‌స్వామి

నల్లగొండటౌన్: విద్యార్థులు విద్యతోపాటు సంస్కారాన్ని అలవర్చుకోవాలని శ్రీశ్రీ త్రిదండి దేవానాద జీయర్‌స్వామి అన్నారు. సోమవారం సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు పెద్దలను, ఉపాధ్యాయులను గౌరవించడం, క్రమశిక్షణ చిన్ననాటి నుంచే అలవాటు చేసుకోవాలన్నారు. నైతిక విలువలు, సంప్రదాయాలతో మంచి మార్గంలో నడవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మంగళశాసనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవహర్త నేవర్స్ అభిలాష్, దీపిక, చకిలం వేణుగోపాల్‌రావు, సంధ్యారాణి, జానకీదేవి, విజయ, సుజాత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడికి నివాళి

నల్లగొండటౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన రేపాల సత్యనారాయణ ఆదివారం నల్లగొండలోని ఆయన కుమారుడి ఇంట్లో మృతి చెందాడు. సోమవారం ఆయన మృతదేహాన్ని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ యామ కవితదయాకర్, కమ్యూనిస్టు నాయకులు, వాకర్స్ సభ్యులు, డాక్టర్లు, న్యాయవాదులు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.